క్లుప్తంగా

నేడు హుండీ లెక్కింపు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందన్నారు.

ఓటర్ల సర్వే ప్రగతిపై సమీక్ష


ఓటర్ల సర్వే ప్రగతిపై సమీక్షిస్తున్న ఆర్‌డీఓ వసంతరాయుడు

అల్లవరం: పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సర్వే ప్రగతిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డీఓ వసంతరాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ వసంతరాయుడు మాట్లాడుతూ మండలంలోని 19,360 కుటుంబాలకు గాను 16,230 కుటుంబాలకు ఇంటింటి సర్వే చేశామన్నారు. సర్వేలో ఓటు నమోదు, సవరణ, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. ఇంటింటి సర్వే కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొనకూడదని ఆర్‌డీఓ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివప్రసాద్, డీటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్‌ఐ దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీఫ్ మినిస్టర్ పోలీస్ మెడల్ అందజేత


సీఎం రంగసామి చేతుల మీదుగా పోలీస్ మెడల్ అందుకుంటున్న రమణమూర్తి

యానాం: పుదుచ్చేరి పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు అందించినందుకు ఇచ్చే «చీఫ్ మినిస్టర్ పోలీస్ మెడల్–2023»కు యానాం పోలీస్‌స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కేవీ రమణమూర్తి ఎంపికయ్యారు. మంగళవారం పుదుచ్చేరిలో జరిగిన 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రంగసామి చేతుల మీదుగా ఆయన పోలీస్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా రమణమూర్తికి ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం, ఎస్‌ఐలు శేరు నూకరాజు, పువ్వల వీరభద్ర రావు, కట్టా సుబ్బరాజు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి


మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్ర నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర 21వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ తాలుకా యూనిట్ సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను కలిసి మహాసభలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాలుకా యూనిట్ అధ్యక్షుడు సుంకర శ్రీహరి, ఆర్.రాంబాబు, కోలా కృష్ణ, అరుణ్‌కుమార్, సత్యకళ, పీవీ రమణి పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలరావు జయంతి

యానాం: ఫ్రెంచి కాలంలో యానాం పట్టణ మేయర్‌గా వ్యవహరించిన కామిశెట్టి వేణుగోపాలరావు జయంతిని బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ రివర్ బీచ్ రహదారిలో ఆయన విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ప్రకాశం, ఎస్‌ఐ శేరు నూకరాజు, కొల్లు ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికు నివాళి


వాజ్‌పేయికు నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురం బీజేపీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాళ్ల దొరబాబు, జిల్లా బీజేపీ శాఖ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండేటి ఈశ్వర్ గౌడ్, బొంతు శివాజీ, అరిగెల తేజ వెంకటేష్, నందూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

జ్వరాలతో జర భద్రం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు


కొత్తలంక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మిడివరం: వర్షాకాలం.. ఎక్కడచూసినా చిత్తడిగానే కనిపిస్తుంది. పైగా గోదావరికి వరదల కారణంగా లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే కాకుండా తాగునీరు కలుషితమైన పరిస్థితులున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణుల్ని జ్వరాలు చుట్టుముట్టే ప్రమాదముంటుంది. అందుకే ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు సురక్షితమైన తాగునీరు తాగడం తదితర ముందు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే శ్రీరామరక్ష

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, బోధకాలు, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంట్లోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో దోమల గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉత్పత్తి అధికంగా ఉంటుంది. నీటి నిల్వ చేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, పారేసిన కొబ్బరి బొండాలు, ఫ్లవర్ వాజ్‌లు, రుబ్బు రోళ్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్సులు, వాటర్ హెడ్ ట్యాంకుల్లో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తుంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డ్రై డేపై అవగాహన కల్పిస్తున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం

గ్రామాల్లో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలున్న వారందరి రక్తాన్ని సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల శుభ్రత, పారిశుధ్య పనులపై పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగడం, వేడి ఆహారమే తీసుకోవడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం తదితర జాగ్రత్తలు అవసరం. ప్రజలంతా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి. జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో సిద్ధంగా ఉన్నాయి.

– వి.వినీల్, పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తలంక

ఉత్తమ సేవా పురస్కారాలు


మంత్రి జోగి రమేష్ నుంచి ఏపీ స్టేట్ ఉత్తమ సేవా పతకాన్ని అందుకుంటున్న ఎస్‌ఐ రామకృష్ణ, అమలాపురం పట్టణ సీఐ దుర్గా శేఖరరెడ్డి, భీమనపల్లి గ్రూప్ టెంపుల్స్ ఈవో కార్తీక, ఉపాధ్యాయుడు బాలకృష్ణ, కానిస్టేబుల్ గౌతమ్

అమలాపురం టౌన్, అమలాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. స్థానిక బాలయోగి స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో(డీటీఆర్‌బీ) ఎస్‌ఐ జి.రామకృష్ణ ఏపీ స్టేట్ ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. అమలాపురం పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గా శేఖర రెడ్డి, కానిస్టేబుల్ గౌతమ్, భీమనపల్లి గ్రూప్ టెంపుల్స్ ఈవో కోనేటి కార్తీక, అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణలు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

ఏరియా ఆస్పత్రిలో ముగ్గురికి పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ పద్మశ్రీ రాణి

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ చక్రధర్, సీనియర్ అసిస్టెంట్ రమేష్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. స్థానిక బాలయోగ స్టేడియంలో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేదికపై మంత్రి రమేష్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ రాణి అభినందించారు.

విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలొద్దు

యానాం: విద్యా సంవత్సరం మధ్యలో ప్రభుత్వ టీచర్లను బదిలీ చేస్తే విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందని పలువురు తల్లిదండ్రులు అధికారులకు బుధవారం ఫిర్యాదుచేశారు. బదిలీలు జరుగుతుండటంతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనపై దృష్టి సారించడం లేదన్నారు. బదిలీల పాలసీ విద్యాసంవత్సరం ముందు లేదా తరువాత విడుదల చేయాలని కోరారు.

ఉత్తమ అవార్డుల గ్రహీతలకు అభినందనలు


ఉత్తమ అవార్డులు అందుకున్న డీపీవో, డీఎల్‌పీవో, కార్యదర్శులు

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక బాలయోగి స్టేడియంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అవార్డులు అందుకున్న జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, కార్యదర్శులు రుద్రరాజు ఎస్‌ఎస్ సూరపరాజు, రెడ్డి శిరీషలతో పాటు పలువురు కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులను పలువురు నాయకులు, అధికారులు బుధవారం అభినందించారు.

వృద్ధులకు సొమ్ము అందజేత


బలుసుతిప్ప గాంధీ సెంటరులో వృద్ధులకు సొమ్మును పంచుతున్న లబ్ధిదారులు

కాట్రేనికోన: మండలంలోని బ్రహ్మ సమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప గ్రామంలో గాంధీ సెంటరులో 12 గ్రూపులకు చెందిన 360 మంది ఓఎన్‌జీసీ నష్టపరిహారం లబ్ధిదారులంతా ఒక్కొక్కరు రూ.1000లు చొప్పున మొత్తంగా రూ.3,60,000లు వసూలు చేశారు. ఆ మొత్తాన్ని తమ పరిధిలో పరిహారం రాని 24 మంది వృద్ధులకు ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


తూర్పుపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పోలేకుర్రు పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లరేవు: స్వాతంత్ర్య భారతదేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పోలేకుర్రు పంచాయతీ చినబాపనపల్లి, జగ్జీవన్‌రామ్ నగర్, తూర్పుపేట గ్రామాల్లో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తాళ్లరేవు మండల పరిధిలో కోట్లాది రూపాయిల ఖర్చుతో తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, గృహనిర్మాణాలు, ఇళ్ల స్థలాల పంపిణీ, నూతన పింఛన్లు, తాళ్లరేవు సీహెచ్‌సీ అభివృద్ధి తదితర కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కాదా గోవిందకుమార్, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, రాయుడు గంగాధర్, కొప్పనాతి నూకరాజు, ఎరికే వీరబాబు, దడాల ప్రసన్న, గుత్తుల శ్రీను, కూరాటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోడిలంక సర్పంచ్‌గా పవిత్ర ఏకగ్రీవం


రుద్రరాజు పవిత్ర

అల్లవరం: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో గోడిలంక సర్పంచ్‌గా రుద్రరాజు పవిత్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎంపీడీఓ కృష్ణమోహన్ బుధవారం తెలిపారు. గోడిలంక సర్పంచ్ అభ్యర్థికి ఒక సెట్ నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవం అయ్యిందన్నారు. కొమరగిరిపట్నం 4వ వార్డుకి ఈ నెల 19న ఎన్నిక జరగనుందని, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎన్నిక జరుగుతుందని చెప్పారు.

సర్పంచ్ అభ్యర్థి భాగ్యలక్ష్మి ప్రచారం


సర్పంచ్ అభ్యర్థి భాగ్యలక్ష్మికి మద్దతుగా ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్‌సాగర్ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట గ్రామ సర్పంచ్ పదవికి పోటీచేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి రెడ్డి భాగ్యలక్ష్మి బుధవారం గ్రామ పరిధిలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఆమెకు మద్దతుగా జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, పార్టీ అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జార్జిపేట పంచాయతీ పరిధిలో ఎక్కడా లేనంతగా రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సర్పంచ్ అభ్యర్థి భాగ్యలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మందపల్లి నాగమ్మ, రాంబాబు, ఆంజనేయులు, జగదీష్, సింహాద్రి, పువ్వల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోడిలంక పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ


గోడిలంక పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

అల్లవరం: గోడిలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలు, సాధారణ రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. గోడిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి, ఆ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుమ, లలిత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యువత సైన్యంలో చేరాలి



సైనికుడు రవిబాబును సత్కరించిన దరియాలతిప్ప స్కూల్ సిబ్బంది

యానాం: మాతృభూమి రుణం తీర్చుకునేందుకు యువత సైన్యంలో చేరాలని మాజీ సైనికుడు కూరాటి రవిబాబు అన్నారు. 22 ఏళ్ల పాటు బీఎస్‌ఎఫ్ విభాగంలో హవాల్దార్‌గా విధులు నిర్వహించి ఇటీవలే స్వచ్ఛంద విరమణ చేసిన ఆయనను స్వగ్రామమైన దరియాలతిప్ప కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కూరాటి రవిబాబు మాట్లాడుతూ భారత సైన్యంలోని విభాగాలైన ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీల్లో చేరాలంటూ యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కర్రి భవానిప్రసాద్, ఉపాధ్యాయులు పద్మశ్రీ, సుందరి, మంజరి, వినకోటి మహేశ్వరరావు, సన్యాసిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.